## వ్యసనాలకు బానిసై.. లిఫ్ట్ అడిగి దోపిడీ

*డబ్బుల కోసం తప్పుడు పనులు చేస్తున్న యువతి అరెస్టు*



బొడిగె అర్చన

బంజారాహిల్స్, డిసెంబర్ 27: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తులను లిఫ్ట్ అడిగి.. బ్లాక్‌మెయిల్ చేస్తూ పోలీసులకు చిక్కిన మహిళను బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ సమీపంలోని బాచారం గ్రామానికి చెందిన బొడిగె అర్చన (35) గత కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి, చెడు వ్యసనాలకు బానిసగా మారింది. ఇటీవల ఆన్‌లైన్ గేమ్స్‌లో సుమారు రూ.10 లక్షల వరకు పోగొట్టుకుంది. దీంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో అడ్డదారులు తొక్కడం ప్రారంభించింది. నగరంలోని పలు ప్రాంతాలకు బస్సులో వెళ్లడం, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో లిఫ్ట్ అడిగి.. ఆ తర్వాత వారిని బెదిరించి డబ్బులు గుంజుతోంది. ఈ నెల 24వ తేదీ సాయంత్రం బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని సాగర్ సొసైటీ సమీపంలో బైక్‌పై వెళ్తున్న బేగంపేట సమీపంలోని రసూల్‌పుర ప్రాంతానికి చెందిన గుత్తి జంగయ్యను నిందితురాలు అర్చన లిఫ్ట్ అడిగింది. కొంత దూరం వెళ్లగానే అతడిని అభ్యంతరకరంగా తాకడంతో పాటు గదికి వెళ్దామంటూ ఒత్తిడి చేయడం మొదలుపెట్టింది. కిందకు దిగాలని జంగయ్య చెప్పడంతో.. గొడవకు దిగిన అర్చన, తనను అసభ్యంగా తాకుతూ వేధిస్తున్నావంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ బెదిరింపులకు దిగింది. పోలీసులకు ఫిర్యాదు చేయవద్దంటే తనకు డబ్బు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడంతో సమీపంలోని ఏటీఎం వద్దకు తీసుకువెళ్లి రూ.20వేలు డ్రా చేసి ఇచ్చాడు. ఈ మేరకు బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన క్రైం పోలీసులు రంగంలోకి దిగారు. సీసీ ఫుటేజీలతో పాటు టెక్నాలజీ ఆధారంగా నిందితురాలి ఫోన్ నంబర్‌ను కనిపెట్టారు. ఫోన్ నంబర్ ఆధారంగా అర్చనను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. చాలా కాలంగా ఆమె లిఫ్టు పేరుతో చాలా మందిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజుతున్న విషయం బయటపడింది. నగరంలో దాదాపు 40 మంది వద్ద నుంచి ఆమె డబ్బులు లాగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఇతర పోలీసు స్టేషన్ల పరిధిలో ఆమెపై నమోదైన కేసుల వివరాలను సేకరిస్తుండటంతో బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. చాకచక్యంగా అర్చనను పట్టుకున్న బంజారాహిల్స్ క్రైం పోలీసులను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

## రోగులకు కేర్ టేకర్‌గా ఉంటూ.. చోరీలు

ఘరానా లేడీ అరెస్ట్ • 18 కేసుల్లో నిందితురాలు

బంజారాహిల్స్,డిసెంబర్ 27: కేర్ టేకర్‌గా పనిచేస్తూ.. రోగులకు సంబంధించిన ఆభరణాలను తస్కరిస్తున్న మహిళను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మెహిదీపట్నం సమీపంలోని అయోధ్యనగర్‌కు చెందిన మేరీ సునీతారెడ్డి(45) నల్లకుంటలోని హెల్త్‌కేర్ హాస్టల్‌లో ఉంటూ రోగులకు కేర్ టేకర్‌గా వ్యవహరిస్తున్నది. అనారోగ్యంతో బాధపడే రోగులకు సహాయకురాలిగా కొన్నాళ్లపాటు పనిచేయడం, వారికి నమ్మకం కుదిరిన తర్వాత సరైన సమయం చూసి ఖరీదైన ఆభరణాలు తస్కరించి ఉడాయించడం సునీతారెడ్డికి అలవాటుగా మారింది. ఇటీవల ఖైరతాబాద్‌కు చెందిన కంభంపాటి వెంకటకృష్ణ తల్లి లక్ష్మి బాగోగులు చూసుకునేందుకు ఉద్యోగంలో చేరింది. పనిలో చేరిన మూడో రోజున లక్ష్మి ఆరోగ్యం విషమించడంతో ఆమెను బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో లక్ష్మికి చెందిన ఖరీదైన ఆభరణాలు తీసి, తనతో పాటు వచ్చిన కేర్‌టేకర్ సునీతారెడ్డికి ఇచ్చారు. వైద్యపరీక్షలు పూర్తయిన తర్వాత బయటకు వచ్చిన లక్ష్మి కుటుంబ సభ్యులు సునీతారెడ్డి కోసం చూడగా ఆమె కనిపించలేదు. సుమారు రూ. 4.80 లక్షల విలువైన 18 తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించిన సునీతారెడ్డి కోసం అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు వెంకటకృష్ణ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలతో పాటు సెల్‌ఫోన్ కాల్‌డాటా ఆధారంగా నిందితురాలు సునీతారెడ్డిని అరెస్టు చేశారు. ఆమెను విచారించగా.. అనేక విషయాలు బయటపడ్డాయి. తరచూ గోవా, పాండిచ్చేరి లాంటి ప్రాంతాలకు వెళ్లడం.. జల్సాలు చేయడం అలవాటుగా మారడంతో సుమారు 12 ఏండ్లుగా చోరీలకు పాల్పడుతున్నట్లు తేలింది. నగరంలోని పలు పోలీసుస్టేషన్లలో ఆమెపై 18 కేసులు నమోదై ఉన్నాయి. మూడుసార్లు జైలుకు కూడా వెళ్లివచ్చినట్లు విచారణలో తేలింది. నమ్మకమైన పని మనిషిగా నటించడం, ఆ తర్వాత చోరీ సొమ్ముతో జల్సాలు చేస్తున్న సునీతారెడ్డి.. ఇటీవల ముషీరాబాద్ పీఎస్ పరిధిలో ఓ చోరీ కేసులో జైలు శిక్ష పూర్తిచేసుకుని బయటకు వచ్చింది. నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు.. ఆమె వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

## గంజాయి దందా.. రౌడీషీటర్ అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): గంజాయి దందా చేస్తున్న ఒక రౌడీషీటర్‌ను సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అరెస్ట్ చేసింది. సీసీఎస్ డీసీపీ శ్వేత కథనం ప్రకారం.. అబ్దుల్ వాజిద్‌పై టప్పాచబుత్రలో రౌడీషీట్ నమోదయ్యింది. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న వాజిద్.. దూల్‌పేటకు చెందిన సురేందర్ సింగ్, అంగూరీ బాయ్ వద్ద నుంచి గంజాయి కొని, ఆసిఫ్‌నగర్ ప్రాంతంలో కస్టమర్లకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో ఇన్‌స్పెక్టర్ భిక్షపతి బృందం రౌడీషీటర్‌ను పట్టుకొని అతడి వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# క్విక్ రెస్పాన్స్ ఇస్తాం

- నేరస్తులకు శిక్షలు వేయించడంలో రాష్ట్రంలోనే రాచకొండ నంబర్ వన్
- రాచకొండ వార్షిక నివేదికను విడుదల చేసిన సీపీ సుధీర్‌బాబు

**విజిబుల్ పోలీసింగ్ ఉంటుంది • పారదర్శకంగా సేవలందిస్తాం**

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కేసుల నమోదు సంఖ్య పెరిగినా, నేరస్తులకు శిక్షలు వేయించడంలో తెలంగాణలోనే మొదటి స్థానంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఉన్నదని, ఇది వరుసగా ఐదో సంవత్సరమని పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. రాచకొండ కమిషనరేట్ 2023 వార్షిక నివేదికను ఆయన బుధవారం నాగోల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజా భద్రతే లక్ష్యంగా కమిషనరేట్ పోలీస్ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ అనేది కనిపించకుండా ఉండాలని ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు డ్రగ్స్‌పై తాము యుద్ధం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కన్విక్షన్ రేట్ 61 శాతం పెరిగిందన్నారు. విచారణలో ఉన్న 36,126 కేసుల్లో 75 శాతం పరిష్కరించామన్నారు. నేషనల్ లోక్ అదాలత్‌లో 8,981 కేసులు పరిష్కరించమని సీపీ వెల్లడించారు. మహిళా భద్రత, సైబర్‌క్రైమ్ నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బాల్య వివాహాలను కట్టడి చేస్తామని సీపీ వివరించారు. ఈ ఏడాది అక్రమ వ్యవహారాలు నిర్వహిస్తున్న 299 కేంద్రాలను మూసివేయడంతో పాటు 177 బాల్య వివాహాలను నిలిపివేశామన్నారు. సాంకేతికతను అప్‌డేట్ చేసుకుంటూ ప్రజలకు వేగంగా సేవలందిస్తామన్నారు. రాచకొండ కమిషనరేట్‌లో విజుబుల్ పోలీస్, క్విక్ రెస్పాన్స్‌తో ప్రజలకు వేగంగా సేవలందిస్తామన్నారు. ఒత్తిడి లేకుండా సిబ్బంది పనిచేస్తూ, ప్రజలకు పారదర్శకంగా సేవలను వేగంగా అందించే లక్ష్యంతో ముందుకెళ్తామన్నారు.

### ఈ ఏడాది ప్రధాన కేసులు..

గత ఏడాది 25,815 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 27,586 కేసులు నమోదయ్యాయి. 6.8 శాతం నేరాలు పెరిగాయని సీపీ వెల్లడించారు. సైబర్‌నేరాలు 2022లో 2,049 నమోదు కాగా.. ఈ ఏడాది 2,562 నమోదై.. 25 శాతం నేరాలు పెరిగాయన్నారు. శిక్షల శాతం 2022లో 59 శాతం ఉండగా, 2023లో 61 శాతానికి పెరిగిందన్నారు. 5882 కిలోల గంజా, 6.5 లీటర్ల హాష్ ఆయిల్, 262 గ్రాముల ఎండీఎంఏ, 4.5 కిలోల ఓపియం, 377 గ్రాముల హెరాయిన్, 9.2 కిలోల పప్పీ స్ట్రా, 37 ఎక్సటెసీ పిల్స్, 4 ఎల్ఎస్‌డీ పేపర్లు, 150 నిట్రవిత ట్యాబ్‌లెట్స్.. తదితర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. తెలంగాణ ఎన్నికల్లో 62.6 కోట్ల నగదు, 15.3 కిలోల బంగారం, 21.4 కిలోల వెండి, 300 క్యారెట్ల డైమాండ్స్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్.. ఆపై స్థాయి అధికారులందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. డీసీపీలు జానకీ, సాయి శ్రీ, అనురాధ, రాజేశ్ చంద్ర, శ్రీనివాస్, గిరిధర్, మురళీధర్, శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.




వార్షిక నివేదికను విడుదల చేసిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

**ప్రధాన నేరాలు.. నమోదైన వివరాలు**

| నేరాలు | 2022 | 2023 |
|---|---|---|
| సొత్తు కోసం హత్యలు | 4 | 5 |
| బందిపోటు | 7 | 8 |
| దోపిడీలు/చైన్‌స్నాచింగ్స్ | 47 | 59 |
| దోపిడీలు/ చైన్‌స్నాచింగ్ కాకుండా | 81 | 66 |
| దొంగతనాలు | 3005 | 3331 |
| దృష్టి మళ్లించి దొంగతనాలు | 53 | 53 |
| హత్యలు | 53 | 66 |
| కిడ్నాప్‌లు | 395 | 420 |
| లైంగిక దాడులు | 372 | 327 |
| వరకట్నపు హత్యలు | 16 | 16 |
| డొమెస్టిక్ వాయిలెన్స్ | 1704 | 1582 |
| వేధింపులు/పోక్సో | 1115 | 1061 |
| గొడవలు, ఇతర నేరాలు | 18963 | 20592 |
| సైబర్‌నేరాలు | 2049 | 2562 |
| రోడ్డు ప్రమాదాలు | 3524 | 3321 |

# ఈ ఇంటి నుంచి.. ఇవి ఎత్తుకెళ్తున్నా..

**చోరీ చేసిన వస్తువుల జాబితా చీటిపై రాసి అక్కడే వదిలేసి**

- చోరీల్లో సెంచరీ దాటిన యువకుడిని అరెస్టు చేసిన ఓయూ పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 27: ఎక్కడ దొంగతనం చేసినా.. ఆ వివరాలన్నింటినీ అక్కడి యజమానికి తెలిసేలా చీటీ రాసి ఉంచి.. చోరీల్లోనూ నిజాయితీ ప్రదర్శిస్తున్న ఓ దొంగను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ పారుపల్లి ఆంజనేయులుతో కలిసి ఏసీపీ సైదయ్య వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నాగర్లబండ తండాకు చెందిన రత్లావత్ శంకర్ నాయక్ (28) గద్వాల్‌లో బీఫార్మసీ చదువుతుండగా ఓ హత్యాయత్నం కేసులో 2012లో జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడి, రాత్రుళ్లు బయట తిరిగాడు. జల్సాలకు సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో రాజేశ్ రెడ్డి, రంగారావు, లియాజ్ ఖాన్ తదితర పేర్లతో చలామణి అయ్యాడు. కాలనీలు, వివిధ ప్రాంతాల్లో పగలు తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించి, రాత్రి సమయంలో ఐరన్ రాడ్ సహాయంతో చాకచక్యంగా తలుపు తెరిచి దొంగతనాలు చేశాడు. 2022 సెప్టెంబర్‌లో మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడి, పోలీసులకు చిక్కడంతో పీడీ యాక్టు నమోదు చేసి, జైలుకు పంపారు. అప్పటికి అతడు చేసిన చోరీల సంఖ్య 94. మూడు నెలల కిందట జైలు నుంచి విడుదలైన శంకర్ నాయక్.. తన వైఖరిని మార్చుకోక ఎనిమిది దొంగతనాలు చేశాడు. వాటిలో మూడు ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో కాగా, మిగతావీ ఉప్పల్, కుషాయిగూడ, జడ్చర్ల టౌన్, సంగారెడ్డి రూరల్, నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున ఉండటం గమనార్హం.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ సైదయ్య, చిత్రంలో ఓయూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు



నిందితుడు శంకర్ నాయక్

ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 5లో నివాసముండే లగిశెట్టి రాజు తన కుటుంబంతో సహా గత సెప్టెంబర్ 17న స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి 20న వచ్చి చూడగా.. ఇల్లు తాళం తీసి ఉండటంతో పాటు సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి 19.1 తులాల బంగారు ఆభరణాలు, కొన్ని యూఎస్ డాలర్లు, కొంత నగదు చోరీకి గురైనట్టు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టి, విచారణ జరిపారు. ఈ క్రమంలో నిందితుడు మంగళవారం సాయంత్రం అమీర్‌పేటలో సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి, విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతడి నుంచి ఇరవై తులాల బంగారు ఆభరణాలు, బైక్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరుచనున్నట్లు చెప్పారు. నిందితుడిని పట్టుకున్న డీఐ శ్రీనివాసరావు, ఎస్సై యాసిన్ అలీ, ఏఎస్సై ఈశ్వర్, కానిస్టేబుళ్లు ప్రభాకర్, శ్రీను, నరేశ్, రమాకాంత్, కృష్ణను ఈ సందర్భంగా డీసీపీ సునీల్‌దత్ అభినందించారు.

### ఆ ఇంట్లో ఏమీ దొరకకున్నా..

శంకర్ నాయక్ చోరీ విధానం చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. నిందితుడు ఎక్కడ చోరీ చేసినా.. అక్కడ దొంగతనం చేసిన వస్తువుల వివరాలను ఒక చీటీలో రాసి.. దొంగతనం చేసిన ప్రదేశంలోనే పెడుతాడు. చీటీ రాసేందుకు పేపర్ దొరకని పక్షంలో.. చోరీ సామగ్రి వివరాలను గోడపై రాస్తాడు. అంతేకాకుండా, అన్ని చోరీల వివరాలు, చోరీ చేసిన వస్తువుల వివరాలను కూడా ఎప్పటికప్పుడు డైరీలో పొందుపరిచాడు. గతంలో నిందితుడు ఓ ఇంటిలోకి చోరీకి వెళ్లగా అక్కడ ఎలాంటి వస్తువులు లభించలేదు. ఆ ఇంటి యజమాని మాత్రం ఐదు తులాల బంగారు ఆభరణాలు పోయినట్టు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తన నుంచి రికవరీ కూడా చేశారు.. అప్పటి నుంచి రాయడం అలవాటు చేసుకున్నానని శంకర్ నాయక్ చెప్పడం విశేషం.